TGTEL/25/A0977

# తొవ్వ

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 62 | బుధవారం 29-10-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 5 | వెల : 5 రూ/.

## ఢిల్లీ యువతి అల్లిన యాసిడ్ దాడి కథ

**న్యూఢిల్లీ, అక్టోబరు 28:** "ఆదివారం అయినా అదనపు తరగతులు ఉండటంతో కాలేజీకి వెళుతున్నాను. రోడ్డు మీద వెళుతున్న నాపై ద్విచక్రవాహనం మీద వచ్చిన ఓ ముగ్గురు యాసిడ్ మాదిరి ద్రావణాన్ని పోశారు. ముఖానికి చేతులు అడ్డుపెట్టుకోవడంతో ఆ ద్రావణం చేతుల మీద పడి గాయాలయ్యాయి".. ఇదీ.. ఢిల్లీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న ఓ 19 ఏళ్ల యువతి పోలీసులకు చేసిన ఫిర్యాదు! జితేంద్ర అనే వ్యక్తి తనను కొన్నాళ్లుగా వెంబడిస్తున్నాడని.. ఆ రోజు ఆ వ్యక్తే ద్విచక్రవాహనాన్ని నడుపుతుండగా.. ఇషాన్, ఆర్మాన్ అనే ఇద్దరు అన్నదమ్ములు వెనుక కూర్చున్నారని.. ఇషాన్, అర్మాన్‌కు ఓ బాటిల్ ఇవ్వగా అతడు అందులోని ద్రావణాన్ని తనపై చల్లాడని ఘటనను పూసగుచ్చినట్లు వివరించింది. యువతి రెండు చేతులకు కాలిన గాయాలయ్యాయి. టీవీ చానళ్లలో ప్రసారం కావడంతో ఈ వార్త తీవ్రకలకలం సృష్టించింది. నిందితుల ఆట కట్టించాలని రంగంలోకి దిగిన పోలీసులకు విచారణలో నోరెళ్లబెట్టేలా చేసే పరిణామాలు తెలిశాయి. యాసిడ్ దాడి అంటూ యువతి చెబుతున్నదంతా కట్టుకథ అని పోలీసులు తేల్చారు.

## లుఫ్తాన్సా విమానంలో ఘర్షణ

### ఇద్దరు టీనేజర్లను ఫోర్క్‌తో పొడిచి, మహిళను కొట్టిన తెలుగు యువకుడు

**న్యూఢిల్లీ, అక్టోబరు 28:** షికాగో నుంచి ఫ్రాంక్‌ఫర్ట్ వెళుతోన్న లుఫ్తాన్సా విమానంలో ప్రణీత్ కుమార్ ఉసిరిపల్లి(28) అనే తెలుగు యువకుడు శనివారం ఇద్దరు టీనేజర్లను ఫోర్క్‌తో పొడిచి గాయపరిచాడు. అంతేగాక విమానం సిబ్బందిపైనా దాడికి ప్రయత్నించాడు. దీంతో ఆ విమానాన్ని అత్యవసరంగా బోస్టన్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించారు. మారణాయుధంతో ఇతరులకు హాని చేసేందుకు ప్రయత్నించినట్లు అతడిపై మసాచుసెట్స్ డిస్ట్రిక్ట్ అటార్నీ కార్యాలయం అభియోగాలు మోపింది. విమానంలో ఇద్దరు 17 ఏళ్ల బాలురపై మెటల్ ఫోర్క్‌తో దాడి చేసిన ప్రణీత్ కుమార్ వారిలో ఒకరి భుజంపై, మరొకరి తల వెనుక పొడిచాడు. పరిస్థితిని అదుపు చేసేందుకు వచ్చిన విమానం సిబ్బందికి తన చేతివేళ్లను తుపాకీలా చూపుతూ ట్రిగ్గర్ నొక్కినట్లు చేసి బెదిరించాడని అధికారులు చెప్పారు. అంతేగాక మరో మహిళా ప్రయాణికురాలిని కూడా చెంపపై కొట్టి విమానం సిబ్బంది ఒకరిని కూడా కొట్టేందుకు ప్రయత్నించాడని పేర్కొన్నారు. ప్రణీత్ గతంలో విద్యార్థి వీసాపై అమెరికాలో మాస్టర్స్ చదివాడని, ప్రస్తుతం ఎటువంటి వీసా లేకుండానే ఉంటున్నాడని తెలిపారు.

# టికెట్ల పెంపు ఆదాయంలో

# కార్మికులకు 20 శాతం

- అలాగైతేనే ధరల పెంపునకు అనుమతిస్తాం
- సినీ కార్మికుల వెల్ఫేర్ ఫండ్‌కు రూ.10 కోట్లు ఇస్తాం
- వారి పిల్లలకు కృష్ణానగర్‌లో కార్పొరేట్ స్థాయి స్కూల్
- జబ్బు పడ్డ వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సౌకర్యం
- భారత ఫ్యూచర్ సిటీలో ఫైటర్స్ ట్రైనింగ్ కోసం స్థలం
- నవంబరు ఆఖర్లో సినీ కార్మికుల సమస్యలపై చర్చిస్తాం
- ఏమేం చేయబోతున్నామో డిసెంబరు 9న ఆదేశాలిస్తాం
- అందరూ అండగా ఉంటే హాలీవుడ్‌ను హైదరాబాద్‌కు తెస్తా
- సినీ కార్మిక సంఘాల అభినందన సభలో సీఎం రేవంత్



**హైదరాబాద్ సిటీ, అక్టోబరు 28:** సినీ కార్మికులు తమ సంక్షేమం కోసం వెల్ఫేర్ ఫండ్‌ను ఏర్పాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆ సంక్షేమ నిధికి రూ.10 కోట్లు ఇస్తామని తెలిపారు. ఆ ఫండ్ నుంచే కష్టాల్లో ఉండే కార్మికులను ఆదుకోవాలని సూచించారు. సినిమాలకు టికెట్ల ధరలు పెంచడం ద్వారా వచ్చే ఆదాయం నుంచి కూడా 20 శాతాన్ని కార్మికుల వెల్ఫేర్ ఫండ్‌కు ఇవ్వాలన్నారు. అలా ఇస్తేనే టికెట్ల ధరల పెంపునకు ప్రభుత్వం జీవో ఇస్తుందని స్పష్టం చేశారు. దీంతోపాటు.. సినీ కార్మికుల పిల్లలకు కృష్ణానగర్‌లో కార్పొరేట్ స్థాయిలో పాఠశాల నిర్మిస్తామన్నారు. ఇందుకోసం మూడు, నాలుగు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని చూడాలని అధికారులను ఆదేశించారు. భారత ఫ్యూచర్ సిటీలోనూ సినీ పరిశ్రమకు ప్రాధాన్యం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. మంగళవారం సాయంత్రం సినీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో యూసఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఒకప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమను 'మదరాసి' అని పిలిచేవారని, ఆనాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి ఈ పరిశ్రమను హైదరాబాద్‌కు తరలించడానికి ఎంతో కృషి చేశారని తెలిపారు. ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావు వంటి దిగ్గజ నటుల సహకారంతోనే పరిశ్రమ హైదరాబాద్‌లో స్థిరపడిందన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే తక్కువ ధరకే భూములు ఇచ్చారని, చిత్రపురి కాలనీ అభివృద్ధిలో నాటి నాయకుల కృషిని మరిచిపోకూడదని అన్నారు. నటుడు ప్రభాకర్ రెడ్డి సినీ కార్మికుల కోసం తన 10 ఎకరాల సొంత భూమిని ఇచ్చారని గుర్తు చేశారు. తెలుగు సినిమా నేడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతూ.. ఆస్కార్ స్థాయికి ఎదుగుతోందంటే దానివెనుక నటులు, డైరెక్టర్లే కాకుండా సినీ కార్మికుల కష్టం, శ్రమ ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సినీ కార్మికుల శ్రమ తనకు తెలుసునని, అధికారంతో తన కళ్లు మూసుకుపోలేదని చెప్పారు. కృష్ణానగర్‌లో నిర్మించే స్కూల్లో సినీ కార్మికుల పిల్లలకు నర్సరీ నుంచి 12వ తరగతి వరకు కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా చదువు చెప్పించే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. వారికి ఉదయం బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం లంచ్ కూడా పెట్టే ఏర్పాటు చేస్తామని తెలిపారు. సినీ కార్మికులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సౌకర్యం కల్పిస్తామన్నారు.

హాలీవుడ్ సినిమా షూటింగ్‌లు హైదరాబాద్‌లో జరగాలని, హైదరాబాద్ నగరం ప్రపంచ సినీ పరిశ్రమకు వేదిక కావాలన్నదే తన ఆలోచన అని తెలిపారు. పదేళ్లు ఆగిపోయిన నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులను అందిస్తున్నామని గుర్తుచేశారు. సినీ పరిశ్రమను చిన్నచూపు చూసే ప్రసక్తే లేదని, ఐటీ, ఫార్మాలాగే సినీ పరిశ్రమకూ తమ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని స్పష్టం చేశారు. చిత్రపురి కాలనీ, ఫిలింనగర్, కృష్ణానగర్‌లాగే.. కొత్తగా నిర్మించుకుంటున్న భారత్ ఫ్యూచర్ సిటీలో సినీ రంగానికి పాత్ర ఉంటుందన్నారు.



## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

### ఇద్దరు అగ్రనేతలు పోలీసుల ఎదుట లొంగుబాటు..

### జనజీవన స్రవంతిలోకి పుల్లూరి ప్రసాదరావు, బండి ప్రకాష్

**హైదరాబాద్, అక్టోబరు 28:** మావోయిస్టు పార్టీలో లొంగుబాట్ల పరంపర కొనసాగుతోంది. మంగళవారం మరో ఇద్దరు అగ్రనేతలు పోలీసుల ఎదుట లొంగిపోయారు. కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ శంకరన్న అలియాస్ చంద్రన్న, రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాష్ అలియాస్ ప్రభాత్ అలియాస్ బండి దాదా తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో లొంగిపోయి జనజీవన స్రవంతిలోకి వచ్చారు. మావోయిస్టులు ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు వీరిద్దరు లొంగిపోయారని డీజీపీ తెలిపారు. పుల్లూరి ప్రసాదరావు పేరిట రూ.25 లక్షల రివార్డు, బండి ప్రకాష్ పేరిట రూ.20 లక్షల రివార్డు ఉండగా.. ఆ మొత్తానికి సంబంధించిన డీడీలను వారికి డీజీపీ అందజేశారు. తెలంగాణలో ఈ ఏడాది ఇప్పటివరకు 427 మంది మావోయిస్టులు లొంగిపోయారని శివధర్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయిన వారిలో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు, ఎనిమిది మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఇద్దరు డివిజనల్ కమిటీ కార్యదర్శులు, 8 మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 35 మంది ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారని తెలిపారు. ఇంకా మావోయిస్టు పార్టీలో తెలంగాణకు చెందిన 64 మంది వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర కమిటీ సభ్యులుగా ఐదుగురు, రాష్ట్ర కమిటీ సభ్యులుగా 10 మంది, డివిజనల్, ఏరియా కమిటీల్లో 34 మంది, దళ సభ్యులుగా మరో 10 మంది ఉన్నారని వెల్లడించారు. కేంద్ర కమిటీలో ఇంకా మిగిలిన 9 మందిలో తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, పాక హన్మంతు అలియాస్ ఉకే గణేష్, మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, నరహరి అలియాస్ విశ్వనాథ్ మాత్రమే తెలంగాణకు చెందినవారని తెలిపారు. 45 ఏళ్లపాటు మావోయిస్టు పార్టీలో కొనసాగిన పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న స్వస్థలం పెద్దపల్లి జిల్లా వడ్కాపూర్ గ్రామం. ప్రభుత్వ ఉపాధ్యాయుడు పుల్లూరి శ్రీనివాసరావు, వరలక్ష్మి దంపతులకు రెండో సంతానంగా 1961లో ప్రసాదరావు జన్మించారు.

## డివిజన్‌కు ఇద్దరు మంత్రులు

### జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం బాధ్యతలు

### అప్పగించిన మహేశ్‌గౌడ్, మీనాక్షీ నటరాజన్



**హైదరాబాద్, అక్టోబరు 28** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అధికార కాంగ్రెస్ పార్టీ.. పోలింగ్ తేదీ సమీపిస్తున్న కొద్దీ మరింతగా దృష్టి సారిస్తోంది. ఇప్పటిదాకా ఈ ఉప ఎన్నిక ఇన్‌చార్జి బాధ్యతలను ముగ్గురు మంత్రులే పర్యవేక్షిస్తుండగా.. ఇకపై క్యాబినెట్ మొత్తాన్ని రంగంలోకి దించాలని నిర్ణయించింది. నియోజకవర్గంలోని మొత్తం ఏడు డివిజన్లకుగాను ఒక్కో డివిజన్‌కు ఇద్దరు మంత్రుల చొప్పున కేటాయించి.. వారికి ఎన్నికల పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించింది. తమకు కేటాయించిన డివిజన్లలో ఎన్నికల ప్రచారంతో పాటు స్థానిక సమస్యలపై ఓటర్లకు తగిన భరోసా ఇచ్చే బాధ్యత కూడా వారిదేనని పేర్కొంది. ఇందులో భాగంగా యూసుఫగూడ డివిజన్‌ను మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌కు, రహమత్‌నగర్ డివిజన్‌ను కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, వెంగళ్‌రావునగర్ డివిజన్‌ను తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరికి, సోమాజిగూడ డివిజన్‌ను శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కు, షేక్‌పేట్ డివిజన్‌ను కొండా సురేఖ, వివేక్ వెంకటస్వామికి, ఎర్రగడ్డ డివిజన్‌ను మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావుకు కేటాయించారు. ఇక బోరబండ డివిజన్ బాధ్యతలను మంత్రి సీతక్కతోపాటు నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవికి అప్పగించారు.

# మొంథా బీభత్సం..

## 7 జిల్లాల్లో కల్లోలం,గాలులు, వర్షాలతో కుదిపేసిన తుఫాన్



- అర్ధరాత్రి సమయానికి తీరం దాటిన 'ముప్పు'
- బందరు వద్ద 100 కిలోమీటర్ల వేగంతో గాలులు
- పలు తీర గ్రామాల్లో అలుముకున్న చీకట్లు
- ప్రభావిత ప్రాంతాల్లో కుప్పకూలిన వృక్షాలు
- గోదావరి జిల్లాల్లో చెట్లు కూలి ఇద్దరు మృతి.. నెల్లూరు జిల్లాలో వాగులో ఒకరి గల్లంతు
- పలు జిల్లాల్లో పంటలను ముంచిన తుఫాను
- కావలిలో 22, ఉలవపాడులో 17 సెం.మీ. వర్షం
- రాష్ట్రంలో నేడూ కొనసాగనున్న భారీ వర్షాలు
- పలు జిల్లాలకు ఆకస్మిక వరదల హెచ్చరిక
- పునరావాస కేంద్రాలకు 75 వేల మంది
- వేగంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు

**అమరావతి :** తీవ్ర తుఫాన్ మొంథా బీభత్సం సృష్టించింది! హోరుగాలులు, జోరు వానలతో వణికించింది! మంగళవారం అర్ధరాత్రి తర్వాత తీరం దాటింది. ఈ సమయంలో 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచాయి. అప్పుడప్పుడు వాయువేగం 110 కిలోమీటర్లకూ చేరింది. తీవ్ర తుఫాన్ కారణంగా మంగళవారం తీర ప్రాంతమంతా రాకాసి అలలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. ప్రధానంగా ఏడు జిల్లాల్లో పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. భారీ వృక్షాలు కూకటివేళ్లతో సహా కూలిపోయాయి. తీవ్ర గాలుల తీవ్రతకు కరెంటు స్తంభాలు పడిపోవడంతో కృష్ణా జిల్లా తీర ప్రాంతమంతా అంధకారం అలుముకుంది. తుఫాన్ ప్రభావంతో కోస్తాలోని అనేక ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తున్నాయి. ఇవి బుధవారం తెల్లవారుజాము వరకూ కొనసాగుతాయి. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం, పశ్చిమ గోదావరి నుంచి నెల్లూరు జిల్లాలకు ఫ్లాష్ ఫ్లడ్స్ వస్తాయని హెచ్చరిక జారీచేశారు. కోస్తా జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ మెసేజ్ జారీచేసింది.

## భారత్‌లో పౌర విమానాల తయారీ

- రష్యా సంస్థ యూఏసీతో హాల్ కీలక ఒప్పందం
- దేశంలోనే 200 ఎస్‌జే-100 విమానాల ఉత్పత్తి




**న్యూఢిల్లీ, అక్టోబరు 28:** భారత్‌లోనే తొలిసారిగా పూర్తిస్థాయి ప్రయాణికుల విమానాలు తయారు కాబోతున్నాయి. రష్యాకు చెందిన యునైటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ (యూఏసీ) సహకారంతో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్).. భారత్‌లోనే ఎస్‌జే-100 విమానాలను తయారు చేయనుంది. ఈ మేరకు ఇరు సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. ట్విన్ ఇంజన్, న్యారో బాడీతో నిర్మించనున్న ఈ విమానాలు ఉడాన్ పథకం కింద స్వల్ప దూర ప్రయాణాలకు మరింత ఊతమివ్వనున్నాయని హాల్ మంగళవారం తెలిపింది. టైర్-2, టైర్-3 నగరాల మధ్య ప్రాంతీయ అనుసంధానం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం 2016లో ఉడాన్ పథకాన్ని ప్రారంభించింది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 200కిపైగా ఎస్‌జే-100 విమానాలను 16 విమానయాన సంస్థలు నడుపుతున్నాయి. రష్యాకు చెందిన యూఏసీ వెబ్‌సైట్‌లో పొందుపరచిన వివరాల ప్రకారం ఎస్‌జే-100 చిన్న పరిమాణం కలిగిన విమానం. దీనిలో 103 మంది ప్రయాణించవచ్చు. 3,530 కిలోమీటర్ల పరిధిలోని ప్రయాణాలకు ఇది అనుకూలంగా ఉంటుంది. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తున్నందున అమెరికా అదనపు సుంకాలు విధిస్తున్న తరుణంలో భారత్-రష్యా మధ్య ఈ కీలక ఒప్పందం కుదరడం గమనార్హం.

## హరీశ్‌రావుకు పితృ వియోగం

### ఆయన తండ్రి తన్నీరు సత్యనారాయణరావు కన్నుమూత

**హైదరాబాద్, అక్టోబరు 28 :** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఇంట విషాదం జరిగింది. మాజీ సీఎం కేసీఆర్ బావ, హరీశ్ రావు తండ్రి అయిన తన్నీరు సత్యనారాయణరావు మంగళవారం కన్నుమూశారు. ఆయన పార్థివదేహాన్ని కోకాపేటలోని క్రిన్స్ విల్లాసలో ఉన్న హరీశ్‌రావు నివాసంలో కుటుంబసభ్యులు, ప్రజల సందర్శనార్థం ఉంచారు. అనంతరం మంగళవారం మధ్యాహ్నం ఫిల్మ్‌నగర్‌లోని మహాప్రస్థానానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు రాజకీయ ప్రముఖులు సత్యనారాయణ రావు మృతికి సంతాపం తెలిపారు. తన్నీరు సత్యనారాయణరావు కేసీఆర్ అక్క, ఏడో సోదరి అయిన లక్ష్మి భర్త. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే కేసీఆర్ హరీశ్‌రావు నివాసానికి చేరుకొని సత్యనారాయణరావు భౌతికకాయానికి నివాళులర్పించారు. సోదరి లక్ష్మి, మేనల్లుడు హరీశ్‌ను ఓదార్చారు. అలాగే, హరీశ్ నివాసానికి చేరుకున్న బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సాయంత్రం వరకు అక్కడే ఉండి కార్యక్రమాల ఏర్పాట్లు చూసుకున్నారు. ఇక, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, రాష్ట్ర మం త్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, కౌశిక్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు,




కొప్పుల ఈశ్వర్, పార్థివదేహానికి నివాళులర్పించారు.

# రాజ్ భవన్‌లో వివిధ వర్గాల ప్రముఖులతో గవర్నర్ భేటీ





**హైదరాబాద్, అక్టోబర్ 28:**
తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మంగళవారం రాజ్ భవన్‌లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ప్రతినిధి బృందాలతో సమావేశమయ్యారు. ఈ సమావేశాలలో ముఖ్యంగా, యునైటెడ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్ కమిటీ-2025 కోశాధికారి ప్రవీణ్ థామస్ జాన్ మరియు ఇతర సభ్యులు మర్యాదపూర్వకంగా గవర్నర్‌ను కలిశారు. అనంతరం, 'స్విచ్‌కో సస్టైనబిలిటీ' సంస్థ వ్యవస్థాపక సీఈఓ అయిన అక్షయ్ దేశ్‌పాండే మరియు ఇతరులు గవర్నర్‌తో సమావేశమై, సస్టైనబిలిటీ (సుస్థిరత) అంశాలపై చర్చించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో రాజకీయ ప్రముఖులు కూడా ఉన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఉపాధ్యక్షురాలు మరియు ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి అయిన ఎ. సుగుణ నేతృత్వంలోని ప్రతినిధి బృందం గవర్నర్‌ను కలిసి వివిధ రాజకీయ మరియు సామాజిక అంశాలపై చర్చించారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రోజువారీ కార్యకలాపాలలో భాగంగా వివిధ వర్గాల ప్రముఖులతో భేటీ అయ్యి, వారి సమస్యలను, అభిప్రాయాలను తెలుసుకున్నారు.

# నల్గొండలో కన్నబిడ్డ విక్రయ ఘటన: మంత్రి సీతక్క సీరియస్

**- నివేదిక ఇవ్వాలని ఆదేశం**



**హైదరాబాద్, అక్టోబర్ 28:**
నల్గొండ జిల్లాలో చోటుచేసుకున్న కన్నబిడ్డ విక్రయ ఘటనపై మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ (సీతక్క) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల అమ్మకాలు, అక్రమ దత్తతలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నప్పటికీ ఇలాంటి దారుణ ఘటనలు చోటు చేసుకోవడం పట్ల ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై వెంటనే స్పందించిన మంత్రి సీతక్క, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజాతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. శిశువును తక్షణమే సంరక్షణలోకి తీసుకోవాలని, ఆ తల్లి పరిస్థితిని తెలుసుకోవాలని అధికారులను సూచించారు. ఈ ఘటనకు సంబంధించి ఏమైనా అధికారుల నిర్లక్ష్యం ఉంటే, వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. "తల్లి -బిడ్డల రక్షణ మా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం. పేదరికం లేదా అజ్ఞానం కారణంగా ఇలాంటి దారుణాలు జరగడం మనసుకు బాధ కలిగిస్తుంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తప్పవు" అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ మరియు బాలల సంరక్షణ కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలని ఆమె అధికారులకు సూచించారు. అక్రమ పిల్లల విక్రయాలు, అక్రమ దత్తత వంటి అన్యాయాలను నిరోధించడానికి సమాజం కూడా ముందుకు రావాలని మంత్రి ఈ సందర్భంగా ప్రజలకు పిలుపునిచ్చారు.

# రాష్ట్రంలోని ప్రాజెక్టులపై సమగ్ర అధ్యయనం

**- డ్యామ్‌ల భద్రతపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష**

**- బ్యారేజీల మరమ్మత్తులకు ప్రణాళికలు: బాధ్యత ఏజెన్సీలదే**



**హైదరాబాద్, అక్టోబర్ 28:**
తెలంగాణ రాష్ట్రంలోని నీటి పారుదల ప్రాజెక్టులన్నింటిపైనా సమగ్రమైన అధ్యయనం పూర్తి చేసి, తగిన నివేదికలను తయారు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల వారీగా సమగ్ర విశ్లేషణలు జరగాలని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ 'కాంప్రహెన్సివ్ డ్యామ్ సేఫ్టీ ఎవల్యూషన్'కు సంబంధించి రాసిన లేఖపై ముఖ్యమంత్రి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఉన్నత స్థాయి సమావేశంలో సమీక్షించారు. కేంద్ర మంత్రి లేఖలో ప్రస్తావించిన అంశాలను అధికారులకు వివరించిన ముఖ్యమంత్రి, అందుకు అనుగుణంగా ప్రాజెక్టుల వారీగా సమగ్ర వివరాలతో విశ్లేషణలు జరగాలని, రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌లపైనా స్టేటస్ రిపోర్ట్‌లను తయారు చేయాలని ఆదేశాలిచ్చారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల ప్రస్తుత పరిస్థితిపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. కూలిపోయిన/దెబ్బతిన్న బ్యారేజీల మరమ్మత్తులకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని, మరమ్మత్తులకు సంబంధించిన బాధ్యత ఆయా నిర్మాణ సంస్థలే (సంబంధిత ఏజెన్సీలే) వహించేలా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రాజెక్టుల వారీగా రూపొందించే పూర్తిస్థాయి నివేదికల ఆధారంగా, తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై నవంబర్ రెండో వారంలో మరోసారి సమీక్ష సమావేశం నిర్వహించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా నిర్ణయించారు. తుమ్మిడిహట్టి వద్ద చేపట్టాల్సిన ప్రాజెక్టుపై కూడా ముఖ్యమంత్రి సమీక్షలో చర్చించారు. తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు 80 టీఎంసీల నీటిని తరలించడానికి వీలుగా ప్రాజెక్టుకు అవసరమైన సమగ్ర ప్రణాళికలను తయారు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ ప్రణాళికలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీరు, తాగునీరు అందించే విధంగా ఉండాలని చెప్పారు. ఇందుకు ఇప్పటికే ఉన్న పాత పనులను ఉపయోగించుకుంటూ ముందుకు వెళ్లడానికి వీలుగా అంచనాలను తయారు చేయాలని సూచించారు. అలాగే, సుందిళ్లను మరమ్మత్తు చేసి వినియోగంలోకి తీసుకొచ్చి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తరలించేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని కూడా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

# మొంథా' తుపాను అలజడి

**- కాకినాడ పోర్టులో 10వ నంబరు అత్యంత ప్రమాద హెచ్చరిక జారీ!**



**తొవ్వ డెస్క్ :కాకినాడ, అక్టోబర్ 28:**
బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తుపాను తీవ్రరూపం దాల్చి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు అత్యంత వేగంగా దూసుకొస్తోంది. ఈ నేపథ్యంలో, తుపాను ప్రభావాన్ని ఎదుర్కోవడానికి కాకినాడ పోర్టులో అత్యంత తీవ్రమైన హెచ్చరిక అయిన 10వ నంబరు ప్రమాద సిగ్నల్‌ను అధికారులు జారీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిస్తూ, తుపాను కారణంగా ప్రజలకు ఏర్పడే ఎలాంటి ఇబ్బందిలోనైనా సహాయం అందించేందుకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. తుపాను ప్రస్తుతం కాకినాడకు దాదాపు 270 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది, దీని కారణంగా తీర ప్రాంతాల్లో భారీ అలజడి నెలకొంది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం జాతీయ విపత్తు స్పందన దళం పూర్తిస్థాయిలో సన్నద్ధమైంది. మొత్తం 25 బృందాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాలకు తరలించి, సున్నితమైన ప్రాంతాల్లో ముందస్తుగానే మోహరించారు. ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ నరేందర్ సింగ్ బుందేలా ఈరోజు మీడియాతో మాట్లాడుతూ, తుపానును ఎదుర్కొనేందుకు తమ దళాలు సిద్ధంగా ఉన్నాయని, నష్టాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కేబినెట్ సెక్రటరీ స్వయంగా సమీక్ష నిర్వహించిన తర్వాతే ఈ ఏర్పాట్లు చేశామని స్పష్టం చేశారు. తీరం దాటిన తర్వాత తలెత్తే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిబ్బంది సంసిద్ధంగా ఉన్నారని ఆయన వివరించారు. బంగాళాఖాతంలో తుపాను తీవ్రత పెరుగుతుండటంతో విశాఖపట్నంలోని తుపాను హెచ్చరికల కేంద్రం తీర ప్రాంతాలకు హెచ్చరికలను పెంచింది. కాకినాడలో 10వ నంబరు సిగ్నల్ ఎగురవేయగా, విశాఖపట్నం, గంగవరం, కళింగపట్నం, భీమునిపట్నం పోర్టులలోనూ 9వ నంబరు ప్రమాద హెచ్చరికలను కొనసాగిస్తున్నారు. ఈ తుపాను ప్రభావం పొరుగు రాష్ట్రమైన తమిళనాడుపైనా ఉండవచ్చన్న అంచనాలతో అక్కడి ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. చెన్నైలోని రిపన్ బిల్డింగ్‌లో ఉన్న కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ అధికారులతో సమీక్ష నిర్వహించి, సన్నద్ధతను పరిశీలించారు.

## వరంగల్ ఎంజీఎం సూపరింటెండెంట్‌గా డాక్టర్ హరీశ్ చంద్రా రెడ్డి నియామకం




**తొవ్వ హనుమకొండ, అక్టోబర్ 28:**
వరంగల్‌లోని ప్రముఖ వైద్యశాల అయిన మహాత్మా గాంధీ మెమోరియల్ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ హరీశ్ చంద్రా రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలోని అతిపెద్ద బోధనాసుపత్రులలో ఒకటిగా, వరంగల్ మరియు చుట్టుపక్కల జిల్లాల ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎంజీఎం ఆసుపత్రి కీలక పాత్ర పోషిస్తోంది. ఈ నేపథ్యంలో, ఆసుపత్రి పాలనా వ్యవహారాలలో మరింత సమర్థతను, మెరుగైన పర్యవేక్షణను, రోగులకు నాణ్యమైన సేవలను అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కీలక నియామకం చేపట్టింది. డాక్టర్ హరీశ్ చంద్రా రెడ్డి తక్షణమే బాధ్యతలు స్వీకరించి, ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న వసతులు, వైద్య సేవలు, సిబ్బంది పనితీరు వంటి అంశాలపై పూర్తిస్థాయి సమీక్ష నిర్వహించాలని ప్రభుత్వం తన ఉత్తర్వులలో స్పష్టం చేసింది. కొత్త సూపరింటెండెంట్ సారథ్యంలో ఎంజీఎం ఆసుపత్రి సేవలు మరింత మెరుగుపడతాయని, ప్రజల అంచనాలకు అనుగుణంగా ఆసుపత్రి పని చేస్తుందని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# హైడ్రా దూకుడు

**నగరంలో ఆక్రమణల తొలగింపులో 'హైడ్రా' దూకుడు**

**1.27 ఎకరాల పార్కుకు విముక్తి**



**హైదరాబాద్, అక్టోబర్ 28:**
నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను హైడ్రా సంస్థ మంగళవారం తొలగించింది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అనంతరం, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకుంది. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం, కర్మన్‌ఘాట్ విలేజ్‌లోని హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో ఏకంగా 1.27 ఎకరాల పార్కు స్థలాన్ని కబ్జా చేశారంటూ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. పార్కు స్థలాన్ని లేఔట్‌లో చూపించి, తర్వాత ప్లాట్లుగా విక్రయిస్తున్నారనే ఫిర్యాదును విచారించి, హైడ్రా సిబ్బంది ఆక్రమణలను తొలగించారు. ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి, కాపాడినట్టు బోర్డులు ఏర్పాటు చేశారు. అదేవిధంగా, శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని చందానగర్ సర్కిల్, గంగారాం కాలనీలో కూడా హైడ్రా ఆక్రమణల తొలగింపు చేపట్టింది. 1974లో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ వేసిన సుభాష్‌నగర్ లే ఔట్‌లో, 700 గజాల స్థలాన్ని ప్రజావసరాల కోసం కేటాయించారు. అయితే, పేదల కోసం ఉద్దేశించిన ఈ స్థలంలో ఒక బడాబాబు పాగా వేసి, దానిని ప్లాట్లుగా మార్చారు. ఈ ఆక్రమణలకు గురైన సుమారు 500 గజాల ప్రజావసరాల స్థలాన్ని కాపాడాలని అక్కడి నివాసితులు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, హైడ్రా అధికారులు ఆక్రమణలు తొలగించి, స్థలానికి ఫెన్సింగ్ వేశారు.

## హరీశ్ రావు తండ్రికి మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళులు


**కుటుంబ సభ్యులను పరామర్శ**



హైదరాబాద్, అక్టోబర్ 28:
తెలంగాణ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ హరీశ్ రావు నివాసమైన క్రీన్స్ విల్లాస్‌కు వెళ్లి, సత్యనారాయణ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన హరీష్ రావును ప్రత్యేకంగా పరామర్శించారు. ఈ కష్ట సమయంలో హరీశ్ రావుకు మరియు వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం, ఆత్మస్థైర్యం కలగాలని మంత్రి ఆకాంక్షించారు.

# మొంథా తుపాను బాధితులకు అండగా నిలవండి..

### కాంగ్రెస్ శ్రేణులకు షర్మిల పిలుపు



**అమరావతి, అక్టోబర్ 28:**
'మొంథా' తుపాను సృష్టిస్తున్న విపత్కర పరిస్థితుల్లో ప్రభావిత ప్రాంత ప్రజలకు అండగా నిలవాలని ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా సహాయక చర్యల్లో భాగస్వాములు కావాలని, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. తుపాను ప్రభావంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని షర్మిల సూచించారు. "ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించే విషయంలో మన నాయకులు ముందుండాలి. ప్రాణనష్టం జరగకుండా చూడటం మనందరి బాధ్యత" అని ఆమె పేర్కొన్నారు. ఆపద సమయంలో ప్రజలకు అండగా నిలవడమే మన కర్తవ్యమని, మానవత్వంతో ఈ విపత్తును ఎదుర్కోవాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మరోవైపు, మొంథా తుఫాను ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాల కారణంగా జనజీవనం స్తంభించిపోయింది. రహదారులు చెరువులను తలపిస్తుండగా, అనేక లోతట్టు ప్రాంతాలు, కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో అధికార యంత్రాంగం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. ప్రభావిత ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా అప్రమత్తంగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# హరీశ్ రావు తండ్రి మృతిపట్ల వైఎస్ జగన్ సంతాపం



**హైదరాబాద్, అక్టోబర్ 28:**
తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణరావు మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంతాపం తెలిపారు. ఈ మేరకు ఆయన ట్విట్టర్ (ఎక్స్) వేదికగా విచారం వ్యక్తం చేస్తూ, హరీశ్‌రావు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సత్యనారాయణ రావు ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థించారు. అంతేకాక, వైఎస్ జగన్ హరీశ్ రావుతో ఫోన్‌లో మాట్లాడి తన సానుభూతిని తెలియజేశారు. మరోవైపు, బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా సత్యనారాయణ రావు భౌతిక కాయానికి నివాళులు అర్పించి, పుష్పాంజలి ఘటించారు. కేసీఆర్ ఏడవ సోదరి (అక్క) లక్ష్మికి సత్యనారాయణరావు భర్త కావడం వల్ల ఆయన తన బావతో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. సత్యనారాయణరావు మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, తన సోదరి లక్ష్మిని, ఇతర కుటుంబసభ్యులను పరామర్శించారు. అంతకుముందు, సత్యనారాయణ రావు మృతి విషయం తెలిసిన వెంటనే కేసీఆర్ హరీశ్ రావుకు ఫోన్ చేసి పరామర్శించి, కుటుంబసభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# దేశ రక్షణలో పదాతి దళం

### - అచంచల ధైర్యానికి ప్రధాని నివాళి





**న్యూఢిల్లీ : అక్టోబర్ 28:**
దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న భారత పదాతి దళం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. పదాతి దళ దినోత్సవం సందర్భంగా సైనికుల అపారమైన ధైర్యం, అంకితభావం, నిస్వార్థ సేవను ఆయన కొనియాడారు. వారి నిబద్ధత దేశ శక్తికి, త్యాగానికి ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి భారతీయుడికి స్ఫూర్తిని ఇస్తుందని ప్రధాని మోదీ తమ సోషల్ మీడియా వేదికగా సందేశాన్ని పంపారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 27వ తేదీని 'పదాతి దళ దినోత్సవం'గా లేదా లిలి'శౌర్య దివస్'లిలిగా జరుపుకుంటారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో దేశం ఎదుర్కొన్న పెను సవాల్‌కు ఈ రోజు ముడిపడి ఉంది. 1947 అక్టోబర్ 27న, పాకిస్తాన్ మద్దతుతో వచ్చిన చొరబాటుదారుల నుంచి జమ్మూ కాశ్మీర్ ప్రజలను రక్షించేందుకు భారత సైన్యంలోని సిక్ రెజిమెంట్‌కు చెందిన తొలి బెటాలియన్ శ్రీనగర్ ఎయిర్‌ఫీల్డ్‌లో అడుగుపెట్టింది. చారిత్రక ఘట్టమైన ఆ చర్యే, కశ్మీర్ రాజ్యాన్ని భారత్‌లో విలీనం చేసే ప్రక్రియకు భద్రత కల్పించి, భారతదేశ భౌగోళిక సమగ్రతను కాపాడిరది. పదాతి దళం భారత సైన్యంలోనే అత్యంత కీలకమైన, అతిపెద్ద పోరాట విభాగంగా ఉంది. యుద్ధభూమిలో ముందుండి పోరాడే ఈ దళం, అత్యంత కష్టతరమైన కొండ ప్రాంతాల నుంచి ఎడారుల వరకు దేశ సరిహద్దుల్లో అవిశ్రాంతంగా విధులు నిర్వహిస్తుంటుంది. మాతృభూమి రక్షణ కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టిన వీర జవాన్ల పరాక్రమాన్ని, త్యాగాన్ని స్మరించుకునేందుకు ఈ రోజును కేటాయించారు. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యూఢల్లీలోని జాతీయ యుద్ధ స్మారకం వద్ద సైనికులు, మాజీ సైనికులు అమరులకు పుష్పాంజలి ఘటిస్తారు.

# సౌరశక్తిలో స్త్రీల భాగస్వామ్యం కీలకం

### - రాష్ట్రపతి ముర్ము



**న్యూఢిల్లీ : అక్టోబర్ 28:**
సౌరశక్తిని కేవలం విద్యుత్ ఉత్పత్తికి మాత్రమే కాకుండా, సామాజిక సాధికారతకు, సమ్మిళిత అభివృద్ధికి సాధనంగా చూడాలని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. న్యూఢల్లీలోని భారత్ మండపంలో అంతర్జాతీయ సౌర కూటమి ఎనిమిదో సదస్సు ప్రారంభ ప్లీనరీని ఆమె మంగళవారం ప్రారంభించి ప్రసంగించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో ప్రతి రంగంలోనూ మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమని ఆమె స్పష్టం చేశారు. మహిళా నాయకత్వం వల్లే సౌరశక్తి కేవలం కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా, లింగ వివక్ష అడ్డంకులను కూడా తొలగించగలు గుతోందని ఆమె ఉద్ఘాటిం చారు. సాంకేతికత, ఆవిష్కరణలు, ఉపాధి కల్పన మరియు గ్రామీణ జీవనోపాధితో సౌరశక్తిని అను సంధా నించేందుకు ఒక సామూహిక కార్యాచరణ ప్రణాళికను రూపొందిం చాలని ఆమె సభ్య దేశాలకు సూచించారు. విద్యుత్ లభించడం అనేది సమాజంలో లింగ సమాన త్వానికి పునాది అని, మహిళల చేతుల్లో శక్తి లభ్యత ఉండటం వల్ల అది కచ్చితంగా ఆయా వర్గాల జీవన ప్రమాణాలను మారుస్తుందని ముర్ము విశ్వాసం వ్యక్తం చేశారు. దేశంలో మారుమూల ప్రాంతాల్లోని ఇళ్లకు సైతం విద్యుత్‌ను అందించడంలో భారత్ సాధించిన అనుభవాన్ని ఈ సందర్భంగా ఆమె ప్రస్తావించారు. చేపట్టిన 'సోలార్ ఫర్ షీ' వంటి కార్యక్రమాలను రాష్ట్రపతి ఈ సందర్భంగా అభినం దించారు. ఈ కార్యక్రమం విధానాలు, ఆర్థిక వన రులు, నైపుణ్యాభివృద్ధి వంటి వ్యూహాత్మక జోక్యాల ద్వారా మహిళలను శక్తిమంతులుగా మార్చడానికి కృషి చేస్తోంది. భారతదేశంతో పాటు అనేక సభ్యదేశాల లో మహిళలు సోలార్ ఇంజనీర్లు, వ్యవస్థాపకులు మరియు శిక్షకులుగా ఎదుగుతున్నారని, వారు మినీ గ్రిడ్‌లను నిర్వహిస్తూ, సౌర పంపులను నడుపు తూ తమ ప్రాంతా లకు వెలుగుని స్తున్నారని ఆమె సంతో షం వ్యక్తం చేశారు. అందుబాటు ధర ల్లో నాణ్యమై న సౌర శక్తిని అందించడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా సమానత్వాన్ని, భద్రతను పెంపొం దించేందుకు కృషి చేస్తోందని రాష్ట్రపతి తెలిపారు. మెగావాట్ల సంఖ్య ద్వారానే కాకుండా, వెలుగులోకి వచ్చిన జీవితాల సంఖ్య, బలపడిన కుటుంబాల సంఖ్య ద్వారా మన పురోగతిని కొలవాలని ఆమె సభ్య దేశాలకు హితవు పలికారు. సమ్మిళిత, సమానమైన ప్రపంచ నిర్మాణానికి ఈ అసెంబ్లీ చర్చలు, నిర్ణయాలు ఒక మైలురాయిగా నిలుస్తాయని రాష్ట్రపతి ముర్ము ఆశాభావం వ్యక్తం చేశారు.

## జూబ్లీహిల్స్‌లో కుల సమీకరణం

**వర్గాల వారీగా నేతలను రంగంలోకి దింపిన బీఆర్ఎస్**

**మైనారిటీ ఓట్లను మళ్లించడానికి కాంగ్రెస్ తీవ్ర కసరత్తు**

**కార్తిక భోజనాలకు పార్టీల ప్రణాళికలు**

**హైదరాబాద్ సిటీ, అక్టోబరు 28:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ కూడా ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఓటర్లకు ఎడాపెడా హామీలు, తాయిలాలు మాత్రమే ఇస్తే సరిపోదని.. సామాజికవర్గాల వారీగా కూడా సంతృప్తిపర్చాలని భావిస్తున్నాయి. కులాలకు పెద్దపీట వేసి, ఓటర్లకు గాలం వేయాలని చూస్తున్నాయి. ఇందుకోసం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు తీవ్రంగా కసరత్తులు చేస్తున్నాయి. కులాల వారీగా ఆకర్షించి, గంపగుత్తగా ఓట్లు వేయించుకోవడానికి శ్రమిస్తున్నాయి. ఇందులో భాగంగా కాంగ్రెస్, బీఆర్ఎసలు ఇప్పటికే కీలకమైన నేతలను రంగంలోకి దించాయి. బీజేపీ కూడా వివిధ సామాజిక వర్గాల ఓటర్లను ఏకతాటిపైకి తీసుకొచ్చే ప్రయత్నాలు ప్రారంభించింది. ఎన్నికల వేళ కార్తిక మాసం కూడా రావడంతో కులాల వారీగా పసందైన విందులకు ఆయా పార్టీలు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయి.

# హరీశ్ రావు తండ్రి మృతికి సీఎం రేవంత్ రెడ్డి సంతాపం

### - కుటుంబానికి మనోధ్కెర్యం కలగాలని ఆకాంక్ష

**హైదరాబాద్, అక్టోబర్ 28:**



తెలంగాణ మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు టి. హరీశ్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు మరణం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, ప్రగాఢ సంతాపం తెలిపారు. సత్యనారాయణ రావు మరణ వార్త తెలిసి ముఖ్యమంత్రి విచారం వ్యక్తం చేశారు. ప్రజా జీవితంలో క్రియాశీలకంగా వ్యవహరించిన ప్రముఖ నాయకుడి కుటుంబంలో జరిగిన ఈ విషాదకర ఘటన పట్ల ఆయన తన వైయక్తిక సంతాపాన్ని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో హరీశ్ రావుకు మరియు వారి కుటుంబ సభ్యులందరికీ భగవంతుడు మనోధ్కెర్యం, ఆత్మస్థైర్యం ప్రసాదించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రార్థించారు. దివంగత సత్యనారాయణ రావు పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని ముఖ్యమంత్రి కార్యాలయం ద్వారా అధికారికంగా తెలియజేశారు.

# శంకరమఠంలో రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు..

### శృంగేరి స్వామిని దర్శించుకున్న ముఖ్యమంత్రి



హైదరాబాద్, అక్టోబర్ 28:
తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హైదరాబాద్ నల్లకుంటలోని శంకరమఠాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గణపతి, శారదాంబ, చంద్రమౌళీశ్వర స్వామి మరియు ఆదిశంకరాచార్యుల ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, శంకరమఠంలో 'ధర్మ విజయ యాత్ర' లో భాగంగా హైదరాబాద్‌కు విచ్చేసిన శృంగేరి శారదా పీఠం జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీతీర్థ మహాస్వామి వారిని ముఖ్యమంత్రి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వామి వారికి వేములవాడ ఆలయ అభివృద్ధికి సంబంధించిన తాజా వివరాలను ముఖ్యమంత్రి తెలియజేశారు. ముఖ్యమంత్రి వెంట ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు.

## జిల్లాల పునర్వ్యవస్థీకరణపై సీఎం చంద్రబాబు సమీక్ష

### - అశాస్త్రీయ విభజనను సరిదిద్దాలని ఆదేశం

**అమరావతి, అక్టోబర్ 28 :**




ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం జిల్లాల పునర్వ్య వస్థీకరణపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘంతో కీలక సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన జిల్లాల విభజన అశాస్త్రీయంగా జరిగిందని, దానిని తక్షణమే సరిచేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తో పాటు మంత్రివర్గ ఉప సంఘం సభ్యులుగా ఉన్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, వంగలపూడి అనిత, నిమ్మల రామానా యుడు, బీసీ జనార్థన్ రెడ్డి పాల్గొన్నారు. జిల్లాల సరిహద్దులు, కేంద్రాల విషయంలో ప్రజలు, వివిధ వర్గాలు, ప్రజాసంఘాల నుంచి వచ్చిన వినతులు, అభ్యంతరాలను మంత్రివర్గ ఉప సంఘం ఇప్పటికే పలుమార్లు సమావేశమై పరిగణనలోకి తీసుకున్నట్లు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. ప్రజల సౌకర్యం, పాలనా సౌలభ్యం, భౌగోళిక సమతుల్యత వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని పునర్వ్యవస్థీ కరణ ప్రక్రియను పార దర్శకంగా, శాస్త్రీయంగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు మరియు మంత్రివర్గ ఉప సంఘం సభ్యులకు స్పష్టం చేశారు.

## యూఏఈలో తెలుగోడికి 240 కోట్ల లాటరీ

**అబుదాబి, అక్టోబరు 28:** అదృష్టం ఎప్పుడు, ఎవరిని వరిస్తుందో చెప్పలేం! అబుదాబిలో నివసిస్తున్న ఓ తెలుగు యువకుడికి అమ్మ సెంటిమెంట్ అనుకోని అదృష్టాన్ని తెచ్చిపెట్టింది. ఏకంగా రూ. 240 కోట్ల జాక్‌పాట్ వరించేలా చేసింది. యూఏఈ లాటరీ చరిత్రలోనే అతిపెద్ద మొత్తాన్ని గెలుచుకున్న ఈ అదృష్టవంతుడి పేరు అనిల్‌కుమార్ బోళ్ల. 29 ఏళ్ల ఈ యువకుడి జీవితం ఒక్క రాత్రిలో పూర్తిగా మారిపోయింది. ఆయన ఇప్పుడు యూఏఈ దేశంలోనే అతిపెద్ద ధనవంతులలో ఒకరిగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అనిల్‌కుమార్ చాలా కాలంగా అబుదాబిలో ఉంటున్నారు. అనిల్‌కు లాటరీ టికెట్‌లు కొనే అలవాటు ఉంది. ఈ క్రమంలోనే ఈనెల 18న జరిగిన లక్కీ డే డ్రాలో విజేతగా నిలిచారు. అందులో యూఏఈలోనే రికార్డు స్థాయిలో 100 మిలియన్ దిర్హామ్స్ (రూ. 240 కోట్లు) గెలుచుకున్నారు. "ఇందులో నా ప్రత్యేకత ఏమీ లేదు. అందరిలానే టికెట్ కొన్నాను. కానీ, అందులో ఆఖరి నంబరు చాలా ప్రత్యేకం. మా అమ్మ పుట్టినరోజునే ఆ నంబరుగా ఎంచుకున్నాను" అంటూ లాటరీ సంస్థ తనకు చెక్కు అందజేసిన సందర్భంగా అనిల్ తన విజయం వెనుక ఉన్న రహస్యాన్ని చెప్పారు.

# 20 ఏళ్లలో బీహార్ యువత ఆశలు అణచివేత

**- బీజేపీ-జేడీయూ సర్కారుపై రాహుల్ ఫైర్**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 28:**
బీహార్‌లోని బీజేపీ-జేడీయూ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని తిరోగమనంలోకి నెట్టివేసిందని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి కీలక రంగాలలో బీహార్ దేశంలోనే అట్టడుగు స్థానంలో ఉండడానికి గత ఇరవై ఏళ్లుగా అధికారంలో ఉన్న మోదీ-నితీశ్ ప్రభుత్వమే కారణమని ఆయన ఆరోపించారు. ఇటీవల బీహార్ యువతతో జరిగిన చర్చల నేపథ్యంలో ఆయన ఈ ప్రభుత్వ వైఫల్యాలకు సంబంధించిన గణాంకాలను ట్విట్టర్ వేదికగా విడుదల చేశారు. ఈ గణాంకాలు కేవలం సంఖ్యలు మాత్రమే కాదని, 'డబుల్ ఇంజన్' ప్రభుత్వం బీహార్‌ను ఎంత వెనక్కి లాగిందో చూపే అద్దం అని రాహుల్ వ్యాఖ్యానించారు. ముఖ్యంగా, విద్యారంగంలో బీహార్ దయనీయ పరిస్థితిని రాహుల్ ఎత్తి చూపారు. 9-10 తరగతుల్లో డ్రాపౌట్ రేటులో బీహార్ 29 రాష్ట్రాల్లో 27వ స్థానంలో, 11-12 తరగతుల్లో నమోదు (ఎన్‌రోల్‌మెంట్) రేటులో 28వ స్థానంలో ఉంది. మహిళా అక్షరాస్యత విషయంలో సైతం బీహార్ 28వ స్థానంలో ఉండటం రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందనడానికి నిదర్శనమని ఆయన అన్నారు. ఈ ప్రభుత్వం యువత ఆకాంక్షలను గొంతు నులిమి, రాష్ట్రాన్ని అనాథగా విడిచిపెట్టిందని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి, ఆరోగ్య రంగాలలో కూడా బీహార్ చాలా వెనుకబడిరదని ఆయన విడుదల చేసిన గణాంకాలు చెబుతున్నాయి. ఉద్యోగాల కల్పనలో కీలకమైన సేవా రంగంలో బీహార్ 29 రాష్ట్రాల్లో 21వ స్థానం, ఉత్పత్తి/పరిశ్రమల రంగంలో 23వ స్థానం పొందింది. శిశు మరణాల రేటు విషయంలో 27వ స్థానం, బీమా పథకాల ద్వారా ఆరోగ్య భద్రతలో 29 రాష్ట్రాల్లో చివరి స్థానం (29వ స్థానం) దక్కించుకుంది. అంతేకాకుండా, ఇంట్లో టాయిలెట్ సౌకర్యం విషయంలో కూడా 29వ స్థానంలో ఉండటం ప్రభుత్వ పాలన తీరుకు నిదర్శనమని రాహుల్ విమర్శించారు. మానవ అభివృద్ధి సూచీ తలసరి ఆదాయం వంటి మానవ అభివృద్ధి కొలమానాల్లో సైతం బీహార్ అట్టడుగు స్థానాల్లో ఉందని రాహుల్ పేర్కొన్నారు. తాను కలిసిన బీహార్ యువత సమర్థులు, తెలివైనవారు అని, వారు కష్టపడే గుణంతో ఎక్కడైనా రాణించగలరని కొనియాడారు. కానీ, ప్రభుత్వాలు వారికి అవకాశాలకు బదులు నిరుద్యోగం, నిరాశ మాత్రమే ఇచ్చాయని వాపోయారు. అందుకే, ఇది బదలావ్ (మార్పు)కి సమయం అని, బీహార్ ఆత్మగౌరవాన్ని తిరిగి నిలబెట్టేందుకు మహాకూటమి యొక్క న్యాయ సంకల్పాన్ని మరోసారి బలంగా చాటాలని రాహుల్ పిలుపునిచ్చారు.

# సిద్ధరామయ్య ప్రభుత్వానికి ఎదురుదెబ్బ

**- ఆర్ఎస్ఎస్ లక్ష్యంగా తెచ్చిన ఉత్తర్వులపై హైకోర్టు స్టే!**

**- ప్రభుత్వ ప్రాంగణాల్లో కార్యక్రమాల నిషేధంపై ధార్వాడ్ బెంచ్ మధ్యంతర ఆదేశాలు**

**బెంగళూరు, అక్టోబర్ 28:**
కర్నాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి రాష్ట్ర హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వ ప్రాంగణాల్లో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని, ప్రైవేటు సంస్థలు కార్యక్రమాలను నిర్వహించే ముందు తప్పనిసరిగా పరిపాలనా అనుమతులు పొందాలని కర్నాటక ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై కర్నాటక హైకోర్టు ధార్వాడ్ బెంచ్ మధ్యంతర స్టే విధించింది. ఈ ఉత్తర్వులు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌ను లక్ష్యంగా చేసుకుని జారీ చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రభుత్వం జారీ చేసిన ఈ ఉత్తర్వులను 'పునశ్చైతన్య సేవా సమస్తే' అనే సంస్థ హైకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ నాగప్రసన్న నేతృత్వంలోని బెంచ్ విచారించింది. సంస్థ తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అశోక్ హర్నహళ్లి, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులపై పరిమితి విధించడమేనని వాదించారు. న్యాయవాది వాదనలు విన్న బెంచ్, ప్రభుత్వ ఉత్తర్వులపై మధ్యంతర స్టే ఇస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది. తదుపరి



విచారణను నవంబర్ 17వ తేదీకి వాయిదా వేసింది. ఈ ఉత్తర్వుల కారణంగా ఆర్ఎస్ఎస్‌తో సహా ఇతర ప్రైవేట్ సంస్థలు ప్రభుత్వ ప్రాంగణాల్లో కార్యక్రమాలు నిర్వహించేందుకు గతంలో ఎదురైన అడ్డంకులు తాత్కాలికంగా తొలగిపోయాయి.

# ప్రతి ఉద్యోగి మారుతున్న కాలాను గుణంగా మార్పు చెంది ఉద్యోగ బాధ్యత నిర్వహించాలి

**మున్సిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్**



**తొవ్వ ,ప్రతినిధి,అక్టోబర్ 28:**
నేటి టెక్నాలజీ యుగంలో మారుతున్న కాలానుగుణంగా మార్పు చెంది, ప్రతి ఉద్యోగి తన ఉద్యోగ బాధ్యత నిర్వహించాలని మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్ టి. రాజేశ్వర్ అన్నారు. మంగళవారం మహబూబాబాద్ మున్సిపల్ కార్యాలయంలో వార్డ్ ఆఫీసర్ గా విధుల ను నిర్వహిస్తున్న డోలి సంధ్య గ్రూప్ 2లో డిప్యూటీ తాసిల్దారుగా ఖమ్మం జిల్లాకు వెళుతున్న సందర్భంగా, మహబూబాబాద్ మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ నందు సంధ్య వీడ్కోలు ఏర్పాటు చేశారు ,ఈ అభినందన సభ కు కమిషనర్ టి.రాజేశ్వర్ అధ్యక్షతన జరిగింది. తొలుత సంధ్యను శాలువా, పూలమాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగి, తన ఉద్యోగ నిర్వహణతో పాటు, నేటి పరిశీల కనుగుణంగా టెక్నాలజీని అలవర్చుకొని, ముందుకు సాగాలన్నారు. ఇటు ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానంగా మంచి సేవలను అందించినప్పుడే మంచి గుర్తింపు వస్తుందన్నారు. డోలి సంధ్య, మహబూబాబాద్ మున్సిపల్ కార్యాలయంలో వార్డ్ ఆఫీసర్ పనిచేస్తూ, డిప్యూటీ తాసిల్దార్ గా గ్రూప్ టు ఉద్యోగం పొందటం చాలా సంతోషదాయకమైన విషయం అన్నారు. ఈ సందర్భంగా సంధ్యను అభినందించారు. అలాగే తోటి ఉద్యోగులు సంధ్యను పూలమాల మరియు శాలువాతో సత్కరించి తమ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీధర్, టిపిఓ సాయిరాం, టి.పి.ఎస్ ప్రవీణ్ లు పాల్గొనగా, చివరగా, తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి సింగు రమేష్ మాట్లాడుతూ మున్సిపల్ శాఖ నుండి రెవిన్యూ శాఖలోకి డిప్యూటీ తాసిల్దారుగా వెళుతున్న సంధ్య ఇంకా ఉన్నతమైన ఉద్యోగం లో కి వెళ్లి,ప్రజాసేవలను చేయాలని కోరారు. సంధ్య ను ఈ సందర్భంగా అభినందించారు. వార్డు ఆఫీసర్లు భారత్ రమేష్, రహమాన్, రంజిత్ రెడ్డి, నవీన్ పాల్గొన్నారు

# ఆధార్ కార్డులు లేవని పరిహారం ఇస్తలేరు

**తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు కవితతో ఉదండాపూర్ నిర్వాసితులు**



**జడ్చర్ల, అక్టోబరు 28 :**
'ఆధార్ కార్డులు లేవని, ఇతర గ్రామాలలో ఉంటున్నారని సాకు చూపుతూ దాదాపు 500 మందికి పరిహారం అందకుండా చేస్తున్నారు. 2021 నాటికే కటాఫ్‌తో ప్రస్తుతం 18 సంవత్సరాలు నిండిన 256 మందికి అన్యాయం జరుగుతోంది. నోటిఫికేషన్ జారీ చేసిన నాటికి అవార్డు పాసుకానందున, నేటి విలువ ఆధారంగా పరిహారం ఇవ్వాలి. ముంపు గ్రామాలలో స్ట్రక్చర్ విలువతో పాటు పునరావాసం పరిహారం సైతం నేటి విలువ ఆధారంగానే ఇవ్వాలి' అని తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులోని ఉదండాపూర్ రిజర్వాయర్‌లో నిర్వాసితులు, ముంపు గ్రామాల వాసులు వివరించారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం జడ్చర్ల మండలం ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులను కవిత పరిశీలించారు. అనంతరం రిజర్వాయర్‌లో భూములు, గ్రామాలు కోల్పోతున్న నిర్వాసితులను కలిశారు. ఈ సందర్భంగా రిజర్వాయర్‌తో ఇబ్బందులకు గురవుతున్న అంశాలను కవిత నిర్వాసితులు కృష్ణ, శ్రీను, హన్మంతు, రామకృష్ణ, రామాంజనేయులు ఏకరువు పెట్టారు. పునరావాసం కింద కుటుంబానికి రూ. 16.30 లక్షల పరిహారం ఇస్తున్నారన్నారు.

# పాక్ బరితెగింపు

**కాల్పుల విరమణకు తూట్లు..**

**-లీపా వ్యాలీలో భారత పోస్టులపై దాడి!**

**- 'ఆపరేషన్ సింధూర్' తర్వాత శాంతించిన పాక్.. మళ్లీ వక్రబుద్ధి**



**శ్రీనగర్, అక్టోబర్ 28:**
ఆపరేషన్ సింధూర్‌తో భారత సైన్యం తీవ్రంగా దెబ్బకొట్టినా కూడా పాకిస్థాన్ తన తీరును మార్చుకోలేదు. మరోసారి కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడిచి, సరిహద్దుల్లోని భారత స్థావరాలపై దాడులకు పాల్పడిరది. జమ్ముకశ్మీర్‌లోని లీపా వ్యాలీలో అక్టోబర్ 26, 27 తేదీల మధ్య రాత్రి ఈ ఘటన జరిగినట్లు సమాచారం. పాకిస్థాన్ సైన్యం భారత పోస్టులపై కాల్పులు, మోర్టార్ దాడులకు పాల్పడిరది. అయితే, భారత సైన్యం ఏమాత్రం ఆలస్యం చేయకుండా ధీటుగా బదులిచ్చింది. భారత జవాన్ల నుండి తీవ్రమైన ప్రతిఘటన ఎదురవడంతో పాక్ సైనికులు వెనక్కి తగ్గారు. గతంలో పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం 'ఆపరేషన్ సింధూర్' పేరుతో సర్జికల్ స్ట్రైక్స్‌కు పాల్పడిరది. ఆ దాడుల అనంతరం పాకిస్థాన్ కాళ్లబేరానికి రావడంతో, ఈ ఏడాది మే 10 నుంచి రెండు దేశాల సైనికుల మధ్య నియంత్రణ రేఖ వెంబడి ఎలాంటి ఉద్రిక్తతలు లేకుండా ప్రశాంత వాతావరణం నెలకొంది. అయితే, తాజాగా పాకిస్థాన్ మళ్లీ కాల్పులకు తెగబడటం ఆ దేశం వక్రబుద్ధికి నిదర్శనంగా నిలుస్తోందని సైనిక వర్గాలు పేర్కొన్నాయి.

# హాలీవుడ్ సినిమాలు తెలంగాణలో జరిగేలా చర్యలు

**సినీకార్మికులకు కార్పొరేట్ స్థాయిలో పాఠశాల**

**సినీకార్మికులకు వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు 10 కోట్లు డిపాజిట్ కు ప్రభుత్వం సిద్ధం**



తొవ్వ ,హైదరాబాద్ అక్టోబర్ 28:
యూసుఫ్ గూడలో సినీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... కృష్ణా నగర్ లో ఒక మంచి స్థలాన్ని చూడండి. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు కార్పొరేట్ స్థాయిలో స్కూల్ నిర్మించి సినీ కార్మికుల పిల్లలకు చదువు చెప్పించే బాధ్యత నేను తీసుకుంటానని హామీ..మీ ఆరోగ్య సమస్యలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సౌకర్యం కల్పిస్తాం. కార్మికుల సంక్షేమం కోసం సంక్షేమ నిధి ఏర్పాటు చేసుకోండి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆ సంక్షేమ నిధికి రూ.10 కోట్లు అందిస్తాం. భవిష్యత్ లో ఎంత పెద్దవారైనా అదనంగా టికెట్ల ధరలు పెంచాలనుకుంటే%ా% అందులో 20 శాతం కార్మికుల వెల్ఫేర్ ఫండ్ కు అందిస్తేనే అనుమతి ఇచ్చేలా నిబంధనలు సడలిస్తాం. రాత్రి పగలు తేడా లేకుండా పనిచేస్తున్న శ్రామికుల శ్రమ, కష్టం నాకు తెలుసు. గతంలో నిలిపివేసిన నంది అవార్డుల స్థానంలో ప్రజా యుద్ధ నౌక గద్దర్ అవార్డులను అందిస్తున్నాం. తెలుగు సినిమాను ఆస్కార్ స్థాయికి తీసుకెళ్లడం వెనుక సినీ కార్మికుల కష్టం ఉంది. హైదరాబాద్ నగరం ప్రపంచ సినీ పరిశ్రమకు వేదిక కావాలన్నదే మా కోరిక. తెలంగాణ రైజింగ్ 2047 ప్రణాళికలో ఫిల్మ్ ఇండస్ట్రీకి ప్రత్యేక చాప్టర్ ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

# కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ను కలిసిన నూతన ఎంపీడీవోలు

**తొవ్వ ,మహబూబాబాద్ , అక్టోబర్ 28:**



గ్రూప్ వన్ ద్వారా జిల్లాకు కేటాయించబడి శిక్షణా పూర్తి చేసుకున్న మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారులు మహబూబాబాద్ డి సుస్మిత, చిన్నగూడూరు ఎం సుజాత, నరసింహులపేట వై అంజలి, గంగారం డి వైష్ణవి, బయ్యారం డి దీపిక లు ఈరోజు విధులలో చేరిన సందర్భంగా లిజిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలను అందజేశారు.. క్షేత్రస్థాయిలో ప్రభుత్వం ప్రవేశపెట్టే అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు అభివృద్ధిలో కీలక భూమిక మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారులు పోషించాలని అందుకు నిబద్ధత, సేవ భావంతో విధులు నిర్వహించి జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని ఈ సందర్భంగా కలెక్టర్ కొత్తగా చేరిన ఎంపీడీవోలకు సూచించారు..ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య ప్రణాళిక అధికారి పురుషోత్తం పాల్గొన్నారు.



# మీకు అనిపించేదే నిజం

నటి రష్మిక మందన్నకు ఎక్కడికెళ్లినా నిశ్చితార్థపు సెగ మాత్రం వదలడం లేదు. రీసెంట్‌గా అగ్ర హీరో విజయ్ దేవరకొండతో ఆమె నిశ్చితార్థం జరిగిందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. అయితే.. విజయ్ కానీ, రష్మిక కానీ ఈ విషయంపై ఇప్పటివరకూ క్లారిటీ ఇవ్వలేదు. రీసెంట్‌గా 'ది గర్ల్‌ఫ్రెండ్' ప్రమోషన్‌లో భాగంగా ఓ అభిమాని రష్మికను నేరుగా అడిగేశాడు. 'విజయ్‌తో మీ నిశ్చితార్థం జరిగిందంటకదా?' అని అతడు అడిగిన ప్రశ్నకు నవ్వుతూ తనదైన శైలిలో సమాధానమిచ్చారు రష్మిక మందన్న. 'ఈ విషయంపై ఎప్పుడు చెప్పాలో అప్పుడే చెబుతాను. అయితే.. ఇందులో మీకు ఏమనిపిస్తుందో అదే నిజం..' అంటూ రష్మిక నవ్వేశారు. విజయ్‌తో తాను కలిసి నటించిన 'డియర్ కామ్రేడ్' గురించి చెబుతూ 'ఆ సినిమా మాఇద్దరికీ చాలా ప్రత్యేకమైనది. అందరం కష్టపడ్డా సరైన ఫలితం మాత్రం రాలేదు. ఆ సమయంలో ఆదరించకుండా, ఇప్పుడు ప్రశంసిస్తే బాధగా ఉంటుంది.' అని తెలిపారు రష్మిక

# ఉగాదికి డెకాయిట్



ప్రేమ, ప్రతీకారం నేపథ్యంలో అడివి శేష్ నటిస్తున్న ఇంటెన్స్ క్రైమ్ థ్రిల్లర్ 'డెకాయిట్'. మృణాళ్ ఠాకూర్ కథానాయిక. షానియల్ డియో దర్శకత్వంలో ప్రతిష్టాత్మక అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 ఉగాది కానుకగా మార్చి 19న విడుదల కానున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ మంగళవారం మేకర్స్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంలోనే అడివి శేష్, మృణాళ్‌ఠాకూర్ ఇంటెన్స్ లుక్స్‌లో కనిపిస్తున్న రిలీజ్ డేట్ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు అందర్నీ ఆకట్టుకున్నాయని, జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించే సినిమా ఇదని మేకర్స్ నమ్మకం వెలిబుచ్చారు. బాలీవుడ్ దర్శక, నటుడు అనురాగ్ కశ్యప్ కీలకపాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

## థియేటర్లలో రవితే'జాతర' ఖాయం

'అతిథిగా వచ్చిన సూర్య గురించి ప్రత్యేకించి చెప్పాల్సిందేం లేదు. నటుడిగా ఆయనేంటో అందరికీ తెలుసు. ఇక నవీన్‌చంద్ర.. 'తను ఇలా కూడా చేస్తాడా?' అన్నంత గొప్పగా చేశాడు. ఇందులో తన పాత్ర పేరు శివుడు. తెరపై తనను చూసి షాక్ అవుతారు. శ్రీలీల నా లక్కీ హీరోయిన్. ఇందులో మాస్ క్యారెక్టర్ ఇరగదీసింది. నిర్మాత నాగవంశీ అస్సలు ఖర్చుకు వెనుకాడలేదు. భాను కచ్చితంగా మంచి దర్శకుడవుతాడు. సాంకేతికంగా అందరూ ప్రాణం పెట్టి పనిచేశారు. పేరుకు తగ్గట్టు అక్టోబర్ 1న థియేటర్లలో 'మాస్ జాతరే'.' అని అగ్ర హీరో రవితేజ అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన మాస్ ఎంటైర్టెనర్ 'మాస్ జాతర'. 'మనదే ఇదంతా' అనేది ఉపశీర్షిక. శ్రీలీల కథానాయిక. భాను భోగవరపు దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. అక్టోబర్ 1న సినిమా విడుదల కానున్నది.



# అర్హతను బట్టే డిమాండ్

సినీ పరిశ్రమలో వేతన అసమానతలపై అసహనం వ్యక్తం చేసిన నటీనటులు కోకొల్లలు. తాజాగా నటి ప్రియమణి కూడా ఈ విషయంపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ 'పారితోషికానికి నేనెప్పుడూ ప్రాధాన్యత ఇవ్వలేదు. నిజానికి పారితోషికం అనేది స్టార్‌డమ్‌ని బట్టి ఉంటుంది. నా స్థాయి నాకు తెలుసు. దాన్ని దృష్టిలో పెట్టుకొనే పారితోషికం తీసుకుంటా. నా సహ నటులకంటే తక్కువగా పారితోషికం అందుకున్న సందర్భాలు నా కెరీర్‌లో చాలా ఉన్నాయి. దానికి బాధపడను. అర్హతను బట్టే నా డిమాండ్ ఉంటుంది. అనవసరంగా మాత్రం డిమాండ్ చేశాను.' అని చెప్పుకొచ్చారు ప్రియమణి. షూటింగ్ టైమింగ్స్ గురించి మాట్లాడుతూ 'సౌత్‌లో సరిగ్గా 8గంటలకు షూటింగ్ మొదలవుతుంది. కానీ నార్త్‌లో అలా కాదు. అక్కడ టైమ్ సెన్స్ ఉండదు. నేను సౌత్ అమ్మాయిని కావడంతో క్రమశిక్షణ అలవాటైపోయింది. నార్త్ పద్ధతులు నచ్చకపోయినా ఓర్చుకొని పనిచేయడం అలవాటు చేసుకున్నా.' అని తెలిపారు ప్రియమణి. ప్రస్తుతం తమిళ అగ్ర హీరో విజయ్ 'జన నాయగన్' చిత్రంలో నటిస్తున్నారామె. అలాగే 'ది ఫ్యామిలీ మ్యాన్' మూడో సీజన్‌లో కూడా నటిస్తూ బిజీగా ఉన్నారు.

# నా కోసం ఆ వెన్నెల..



నాగ ప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రలు పోషిస్తున్న ప్రేమకథాచిత్రం 'ఓ చెలియా..'. ఎం.నాగరాజశేఖర్‌రెడ్డి దర్శకుడు. రూపాశ్రీ కొపురు నిర్మాత. నిర్మాణంలో ఉన్న ఈ సినిమా త్వరలో విడుదల కానున్నది. ఈ సినిమా ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తున్నదని మేకర్స్ చెబుతున్నారు. మంగళవారం ఈ సినిమాలోని ఓ ప్రేమగీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. విలక్షణ నటుడు జేడీ చక్రవర్తి ఈ పాటను విడుదల చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. 'నా కోసం ఆ వెన్నెల..' అంటూ సాగే ఈ ప్రేమగీతానికి శివ సాహిత్యం అందించగా, ఎం.ఎం.కుమార్ స్వరపరిచారు. మేఘన, మనోజ్ కలిసి ఆలపించారు. హీరోహీరోయిన్ల ప్రేమను ఆవిష్కరించేలా ఈ పాట సాగింది. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు. అజయ్‌ఘోష్, భోగిరెడ్డి శ్రీనివాస్, సారిపల్లి సతీశ్, యశోద ఆర్.కొలిశెట్టి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈచిత్రానికి కెమెరా: సురేశ్ బాలా, నిర్మాణం: ఎస్ఆర్ఎస్ మూవీ క్రియేషన్స్, ఇందిరాదేవి ప్రొడక్షన్స్.

Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146

## జిల్లా ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ శాఖ గ్రామ గ్రామాన ప్రచార కార్యక్రమాలు

- నూతన రైతులకు ఆయిల్ పామ్ సాగు పై అవగాహన, వరికి బదులుగా ఆయిల్ పామ్ సాగు చెయాలి.

- వరికి బదులుగా కూరగాయలు సాగు చెయాలి. జిల్లాలో రోజు రోజుకు పెరుగుతున్న విస్తీర్ణం........ పత్తి, మిరప లో అంతర పంటగా మునగ.

బోర్లు, బావులు కింద ఆయిల్ పామ్, ఉద్యాన, మల్బరీ, కూరగాయలు, మునగ వంటి మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగు

### ఎకరానికి లక్షన్నర ఆదాయం ౖతులు పంట నమోదు చేసుకోవాలి, రైతుల అవగాహన కార్యక్రమం

**తౌవ్వ,కేసముద్రం, అక్టోబర్ 28**,జిల్లా ఉద్యాన ,పట్టుపరిశ్రమ అధికారి జినుగు మరియన్న మంగళవారం కేసముద్రం మండలంలోని పలు గ్రామాలను సందర్శించి రైతులు పంట మార్పిడి ద్వారా మార్కెట్ డిమాండ్ ఉన్న మునగ, కూరగాయలు, ఆకు కూరలు, పూలు, సీతాఫలం, నిమ్మ, జామ, బొప్పాయి, నేరేడు, పనసతో పాటు నూతన పంటలైన అవకాడో, డ్రాగన్ ఫ్రూట్, గాక్, బోడ కాకర మొదలైన పోషకాలు, ఔషధ గుణాలు ఉన్న వీటిని బోర్లు, బావుల కింద సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.రైతులు తాము సాగు చేస్తున్న ఉద్యాన, మల్బరీ పంటలను రైతు భరోసా పోర్టల్ లో విస్తరణ అధికారుల ద్వారా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి రైతు పొలం గట్ల మీద, పొలం చుట్టూ, పెరట్లో, ఆయిల్ పామ్, పండ్ల తోటలలో అంతర పంటలుగా, డాబాల మీద, ఇంటి ముంగిట రోజువారి కూరగాయల సాగులో మేలైన యాజమాన్య






పద్ధతులు, నూతన రకాల సాగు, ప్రోట్రే లో నారు పెంపకం, ఎత్తు మడులు, మల్చింగ్, బిందు సేద్యం, ఫర్టిగేషన్, వేప పిండి, ఆముదం పిండి వాడకం, వేప నూనె పిచికారి చేయటం, పసుపు రంగు అట్టల వాడకం, సిఫారసు చేసిన ఎరువులు వాడటం, పందిరిపై కూరగాయల సాగు, ట్రెల్లిస్ మెథడ్ లో టమాటా సాగు మొదలైన పద్ధతులు పాటించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కేసముద్రం మండల వ్యవసాయ అధికారి బానోత్ వెంకన్న, మార్కెట్ కమిటీ కార్యదర్శి అమరలింగేశ్వర రావు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ధన్నసరి ముఖ్యకార్యనిర్వహణాధికారి గోపాల మల్లారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి ధారావత్ రాజేందర్, ఉద్యాన విస్తరణ అధికారి బొమ్మగాని రమేష్, మండల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీ నిధులు విడుదల చేయాలి

**ఆఘమేఘాల పై పని చేయించుకుని ముఖం చాటేసిన అధికారులు**

**నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి విష్ణువర్ధన్ డిమాండ్**



తౌవ్వ, కేసముద్రం, అక్టోబర్ 28:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో ఎన్యుమరేటర్ ల ద్వారా రాష్ట్ర ప్రజల వ్యక్తిగత మరియుసామాజిక.ఆర్థిక.కులగణన సర్వే వివరాలు సేకరించిన దరఖాస్తులను జిల్లా కేంద్రంలో నిరుద్యోగ యువత తో డేటా ఎంట్రీ చేపించి సంవత్సరం గడుస్తున్నా నేటికి వారికి నిధులు విడుదల చేయకపోవడం ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణమని నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి విష్ణువర్ధన్ అన్నారు. మంగళవారం కేసముద్రం మండల కేంద్రంలో పత్రిక ప్రకటన విడుదల చేసిన అనంతరం మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా సామాజిక. ఆర్థిక.కులగణన సర్వే డేటా ఎంట్రీ చేసిన ప్రయివేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ లకు ఒక్క దరఖాస్తు ఎంట్రీ చేస్తే రూ.30/- చొప్పున చెల్లిస్తామని ఆయా మండలాల ఎంపీడీవో.ఎంపీఓ లు వారికి వ్యక్తిగత లాగిన్ ఐడీ లు కేటాయించి జిల్లా కేంద్రంలోని జేఏస్టీయూ కేంద్రంలో డేటా ఎంట్రీ చేపించి ఇప్పటికీ వారికి డబ్బులు చెల్లించకపోవడం విచారకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వారితో పని చేయించుకునే సమయంలో అధికారులు పెట్టిన తొందర వారికి నిధులు విడుదల చేపించడంలో నిర్లక్ష్యంగా సమాధానాలు చెప్తూ రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేవిధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే జిల్లా కలెక్టర్ ఈ సమస్య పై స్పందించి డేటా ఎంట్రీ చేసిన ప్రభుత్వ. ప్రయివేటు ఆపరేటర్ లకు నిధులు విడుదల చేపించేలా తగు చర్యలు తీసుకోవాలని పత్రిక సుముకంగా విజ్ఞప్తి చేశారు.

## కుల , జనన, మరణ, ఆదాయ, ఇతరత్ర ధ్రువపత్రాలు సకాలంలో అందజేయాలి

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

యాదాద్రి జిల్లా:రామన్నపేట: తౌవ్వ ప్రతినిధి: అక్టోబర్ 28

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు, వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. అనధికారికంగా విధులకు హాజరు కాని వారిపై కఠిన చర్యలు తప్పవని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు.మంగళవారం రామన్నపేట ఏరియా ఆసుపత్రి జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగాఅటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించారు. ఈ రోజు ఎంత మంది సిబ్బంది విధులకు హాజరు అయ్యారని రిజిస్టర్ ను





పరిశీలించారు.విధులకుఅనధికార గైర్హాజర్ అయిన ఆయుర్వేదిక్ డాక్టర్ ను సస్పెండ్ చేస్తూ మిగతా వైద్యులకు షోకాస్ నోటీసులు జారీ చేనున్నట్లు తెలిపారు.ఆసుపత్రి లో వార్డులను కలియ తిరిగారు, వార్డులను, పరిసరాలను, ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.వైద్యులు అందరూ రోజు విధులకు హాజరు కావాలని నిర్లక్ష్యంగా వహిస్తే కఠిన చర్యలు తప్పవు అనిహెచ్చరించారు.ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్యులు మంచిగా వైద్యం అందిస్తున్నారా, సిబ్బంది ఏమైనా ఇబ్బంది పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణలో వర్షం నీరు నిలువ ఉండడంతో నీరు బయటకు వెళ్లేలా మార్గం ఏర్పాటు చేయాలని తహసీల్దార్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెంట్ డాక్టర్ చిన్ను నాయక్, తహసిల్దార్ లాల్ బహదూర్, వైద్యులు శ్రీనివాస్, వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## యంత్రీకరణ కోసం దరఖాస్తులు..

**రాయితీపై వ్యవసాయ పనిముట్లు..**

**వ్యవసాయ అధికారి బి .వెంకన్న**



**తౌవ్వ,కేసముద్రం ,అక్టోబర్** 28:కేసముద్రం మండల రైతులు వ్యవసాయ పనిముట్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి. వెంకన్న అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసముద్రం మండలానికి 2025-26 ఆర్థిక సంవత్సరంకు గాను వ్యవసాయ శాఖలో సబ్ మిషన్ అన్ అగ్రికల్చర్ మెకనైజేషన్" (స్మాల్) పథకం ద్వారా సబ్సిడిలో వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నాయని, ఇందులో బ్యాటరీ స్ప్రేయర్లు - 197, పవర్ స్ప్రేయర్లు - 36, రోటవేటర్లు - 13. సీడ్ కం ఫర్టి డ్రిల్స్ - 03 డిస్క్ హరో/కల్టివేటర్స్ / కేజ్ వీల్స్ / ఎంబి -ప్లవ్స్ - 18, బండ్ ఫార్మర్స్ - 01, పవర్ వీడర్స్ - 01, బ్రష్ కట్టర్స్ - 03 పవర్ టిల్లర్స్ %-%02 మరియు స్ట్రా బౌలర్స్ - 02 అందుబాటులో ఉన్నాయని ఎస్సీ, ఎస్టీ మరియు మహిళా రైతులకు 50 శాతం రాయితీతో, మిగితా రైతులకు 40 శాతం రాయితి పై కలవని మండల వ్యవసాయ అధికారి వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.కావలసిన పత్రాలు- పట్టాదార్ పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ట్రాక్టర్ అర్ సి తో పాటు దరఖాస్తు ఫారం నింపి, మండల వ్యవసాయ కార్యాలయంలో సమర్పించి సద్వినియోగం చేసుకోగలరని మండల వ్యవసాయ అధికారి, కేసముద్రం బి వెంకన్న ఈ సందర్భంగాపేర్కొన్నారు.రైతులు నవంబర్ ఒకటవ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. పూర్తి వివరాల కోసం ఏఈఓ లను సంప్రదించాలని తెలిపారు.

## మాదకద్రవ్యాల నిర్మూలన పై అవగాహన సదస్సు

**యాదాద్రి జిల్లా: రామన్నపేట: తౌవ్వ ప్రతినిధి బీఅక్టోబర్ 28**

రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని,విద్యార్థులకుపొగాకు ఉత్పత్తులుసిగరెట్లు, బీడీలు, గుట్కా, జర్దా, పాన్ మసాలా, తంబాకు వంటివి వాడకూడదని, చెడు వ్యసనాలు బారిన పడకూడదని, హెచ్ ఈ ఓ జి గోపాల్ అన్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ పొగాకు వాడకం వల్ల కలిగే క్యాన్సర్ ముఖ్యంగా నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, గొంతు క్యాన్సర్,శ్వాస సంబంధిత వ్యాధులు, గుండె సంబంధ మైన సంభవిస్తాయని తెలిపారు. యువత చెడు అలవాట్లకు అలవాటు కావొద్దని, మాదాక ద్రవ్యలకు అలవాటు కావద్దని తెలియచేసి, ప్రతిజ్ఞ చేయించడమైనది. మరియు అయిడిన్ లోపం వలన థైరా యిడు, గొయిటర్, బుద్ధిమాంద్యం, ఎదుగుదల లోపిస్తాసి అని అందరూ అయోడిజడ్ సాల్ట్, ఉదయించే సూర్యుని గుర్తు ఉన్న ఉప్పును వాడవాలెనని తెలియజేసినారు.ఈ కార్యక్రమం లో ఇంచార్జి ప్రిన్సిపాల్ జాదగీశు లెక్చరర్స్, ఏఎన్ఎం మంజుల, సాదియా తదితరులు పాల్గొన్నారు.





# కేటీఆర్ కు వినతి పత్రం అందజేసిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు షేక్ చాంద్

యాదాద్రి జిల్లా :రామన్నపేట: తొవ్వ ప్రతినిధి బీఅక్టోబర్ 28

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ కన్వీనర్ షేక్ చాంద్ మంగళవారం బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తెలంగాణ ఉద్యమకారులు కృషి చేశారు వారికి ఇండ్ల స్థలాలు పింఛన్లు హెల్త్ కార్డులు ఇవ్వాలని ఉద్యమకారుల త్యాగాలను పర్వద్దని నిఖార్సైన అయినా తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని తనవంతు ప్రయత్నం చేయాలని వినతి పత్రంలో కోరారు. అదే ఆలోచన చేస్తున్నామని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వివరణ ఇచ్చారని షేక్ చాంద్ తెలిపారు.



## వ్యవసాయ పనిముట్ల కోసం దరఖాస్తు చేసుకోండి

### యంత్రీకరణ పనిముట్లపై 50 శాతం 40 శాతం సబ్సిడీ, ఈనెల 31వ తారీకు లోపు దరఖాస్తు చేసుకోవాలి, మండల వ్యవసాయ అధికారి గుంటక నరసింహారావు,

తొవ్వ న్యూస్ ప్రతినిధి, కురవి అక్టోబర్ 28,



రైతులు తమకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై ఈనెల 31 వ తారీకు వరకు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి గుంటక నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం తొవ్వ ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులు తమ అవసరాలకు ఉపయోగపడే యాంత్రీకరణ పనిముట్లు సబ్సిడీపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. అవసరం ఉన్న ప్రతి రైతు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో ఉన్న రైతులు రైతు వేదికలో క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారికి దరఖాస్తులు ఇవ్వాలని ఆయన సూచించారు. బ్యాటిరి స్ప్రేయర్ 161, పవర్ స్ప్రేయర్ 29, ట్రాక్టర్ పని ముట్లు14, సీడ్ కం ఫర్టీడ్రిల్ 2 ,రోటోవేటర్ 11, బ్రష్ కటర్స్ 2, పవర్ వీడర్లు 2, మరియు స్ట్రా బేలర్ 2, పవర్ టిల్లర్స్ 2, కావలిసిన రైతులు మీ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారులకు సంప్రదించగలరు. రైతులకు మరియు జనరల్ మహిళా రైతులకు 50% సబ్సిడీ మరియు ఇతరులకు 40% సబ్సిడీ ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలు కోసం సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని తెలిపారు. దరఖాస్తు ఫారం తో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ పట్టాదార్ పాస్ పుస్తకం జిరాక్సు జతచేయాలని తెలిపారు.

# కుల , జనన, మరణ, ఆదాయ, ఇతరత్ర ధ్రువపత్రాలు సకాలంలో అందజేయాలి

## జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**యాదాద్రి జిల్లా :రామన్నపేట: తొవ్వ ప్రతినిధి బీఅక్టోబర్ 28**



రామన్నపేట తహసీల్దార్ కార్యాలయన్ని జిల్లా కలెక్టర్ హనుమంతరావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జి ల్లా కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయంలో జనన, మరణాల, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల, భూ భారతి, బియాండ్ ఎస్ ఎల్ ఏ కింద పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించారు. ధ్రువీకరణ పత్రాలు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. పెండింగ్ లో పెడితే క్రమ శిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్తగా వచ్చిన జీపీఓ లకు ఆర్.ఐ లు ట్రైనింగ్ ఇవ్వాలని ఆదేశించారు.మండలంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పై ఎంపీడీఓ ని అడిగి తెలుసుకున్నారు. వివిధ దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా చూడాలని సూచించారు.బిఎల్ఓ లు చేస్తున్న ఓటర్స్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు ఉన్నారు.

# పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు, 2 కే రన్

యాదాద్రి జిల్లా:వలిగొండ: తొవ్వ ప్రతినిధి: అక్టోబర్ 28 :



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా మంగళవారం వలిగొండ ఎస్సై వి జిగేందర్ ఆధ్వర్యంలో వలిగొండ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి లోతుకుంట వరకూ 2 కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పట్టణ ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగం కల్పించిన ఉపాధి హక్కును కాలరాస్తున్న పాలకులపై ఉద్యమిస్తాం

## ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర,

యాదాద్రి జిల్లా: భువనగిరి: తొవ్వ ప్రతినిధి: అక్టోబర్ 28



భారత రాజ్యాంగం కల్పించిన ఉద్యోగ,ఉపాధి హక్కును కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర పాలకులపై ఉద్యమించాలని,కార్పొరేట్ లకు దేశ సంపదను దోచి పెట్టిన చరిత్ర మోడీ ప్రభుత్వానిదేనని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర అన్నారు.ఏఐవైఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కౌన్సిల్ సమావేశం భువనగిరి లోని కార్యాలయంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ ఎల్ఐసి సొమ్మును ఆదానికి ధారాదత్తం చేసిన బీజేపీ విధానాలు దేశానికి ప్రమాదకరమని వారు ఆరోపించారు. పేద ప్రజలు ఎల్ఐసికి రూ. 33వేల కోట్ల రూపాయల డిపాజిట్ చేస్తే అదానీ కంపెనీ సంక్షోభంలో ఉన్నదని వారిని ఆదుకోవడం కోసం ఎల్ఐసి వద్ద వేల కోట్ల పేద ప్రజల డబ్బులు అదానీ కంపెనీకి ఇవ్వడం మోడీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానం అర్థం అవుతుందని అన్నారు. ప్రధాని మోదీ పరిపాలనతో దేశం తిరోగమనానికి వెళ్లిందని, కేవలం ప్రసంగాలు, మాటలు తప్పితే ప్రజలకు చేసేందేమీ లేదని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోదీ ప్రభుత్వం గడిచిన 12ఏండ్ల కాలంలో బడా కార్పొరేట్ లకు 15లక్షల కోట్ల రూపాయల దేశ సంపదను అక్రమంగా దోచి పెట్టిన నీచ చరిత్రను మూటగట్టుకున్నారని వారు ధ్వజమెత్తారు. గతంలో బడా కార్పొరేట్ శక్తులు ప్రభుత్వం కు 37శాతం పన్ను కడితే, ఈ బీజేపీ హయాంలో దానిని 16శాతానికి తగ్గించారని, దీని కారణంగా దేశ సంపదకు 9లక్షల కోట్ల రూపాయలు నష్టం వాటిల్లిందని ఆరోపించారు.బడా కుబేరులకు యథేచ్ఛగా రాయితీలు ప్రకటించి, సామాన్యుల జీవన పరిస్థితులు దేశ వ్యాప్తంగా దుర్భర స్థితికి మార్చిన చరిత్ర మోడీ ప్రభుత్వానిదని వారు దుయ్యబట్టారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి ఎల్లంకి మహేష్, పేరబోయిన మహేందర్ లు మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి కల్పన కేంద్రాలు నామమాత్రంగా వ్యవహరిస్తోందని, ఉపాధికి అవసరమయ్యే నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి ఆయా రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.ప్రభుత్వ ఆసుపత్రుల సమస్యలపై సర్వేలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరి వెంకటేష్, జిల్లా సమితి సభ్యులు ఎండీ. నయీమ్, బద్దుల శ్రీనివాస్, సుద్దాల సాయికుమార్, బెల్లి శ్రీకాంత్, నర్సింహా చారి, అలంశెట్టి వెంకటేష్, విజయ్, భాను కృష్ణ, కంబాల వెంకటేష్, తోటకూరిశ్రీకాంత్, అనంతుల నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## కల్లు గీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా రెండోసారి గాజుల ఆంజనేయులు ఎన్నిక

**యాదాద్రి జిల్లా: వలిగొండ : తొవ్వ ప్రతినిధి: అక్టోబర్ 28:**




యాదాద్రి భువనగిరి జిల్లా కలిగిత కార్మిక సంఘం 4వ మహాసభలు చౌటుప్పల్ ఎమ్మెస్ రెడ్డి గార్డెన్లో రాగిరి కృష్ణయ్య మద్దెల రాజయ్య ధూపాటి వెంకటేష్ అధ్యక్ష వర్గంగా జరిగిన మహాసభలలో ముఖ్య అతిథులుగా కలిగితే కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుయ కార్యదర్శిలు మేకపోతుల వెంకటరమణ బెల్లంకొండ వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ వృత్తిని ఆధునికరించి నీరా తాటి ఈత ఉత్పత్తులను ప్రోత్సహించి యువతి యువకులకు ఉపాధి కలిగించే ఆలోచన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేయాలని అన్నారు. ఈ సందర్భంగా వలిగొండ మండలం గోపరాజు పల్లి గ్రామానికి చెందిన గాజుల ఆంజనేయులు రెండోసారి యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

# గార్ల నూతన ఎస్సై గా సాయికుమార్ బాధ్యత

తొవ్వ గార్ల అక్టోబర్ 28:



గార్ల మండల పోలీస్ స్టేషన్ నూతన ఎస్సై గా సాయికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు,నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని,ప్రజల భాగస్వామ్యంతోనే మెరుగైనఅందించగలమని ఆయన పేర్కొన్నారు.






**తొవ్వ న్యూస్ ప్రతినిధి, కురవి అక్టోబర్ 27,**

కురవి దేవస్థానం మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో 365 జాతీయ రహదారికి పర్లాంగ్ దూరంలో శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయం నిర్మించబడి ఉన్నది. ఖమ్మం నల్గొండ సూర్యాపేట భద్రాది కొత్తగూడెం, ములుగు, జిల్లాల నడుమ ఉన్న శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయం అభివృద్ధి కి ఎన్నో మార్గాలు ఉన్న అధికారులు నాయకులు వారి వారి స్వప్రయోజనాల కోసమే చూసుకుంటున్నారు గానీ భక్తుల కోసం మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆలోచన లేకుండా పోయిందని వీరభద్రుని భక్తులుఆరోపిస్తున్నారు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే వీరభద్ర స్వామికి బంగారు కోర మీసాలు బహుకరిస్తారని మొక్కుకొని కురవికి ముఖ్యమంత్రి హోదాలో వచ్చి స్వామి వారికి బంగారు మీసాలు సమర్పించుకున్నారు. ఆలయ అభివృద్ధికి ఐదు కోట్ల రూపాయలు మంజూరి చేస్తున్నాను భక్తుల మధ్య ప్రకటించారు. సంవత్సరాల గడిచిన ఇంకా ఆ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి అని భక్తులు గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలోని పెద్ద మండల కేంద్రంగా ఉన్న కురవి మేజర్ గ్రామపంచాయతీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నదని ప్రజలు ఆరోపణ, వేలాదిమంది దేవస్థానానికి, ప్రతి సోమవారం సంత ( అంగడి) కి వస్తూ ఉంటారు. కానీ వచ్చే భక్తులకు అంగడికి వచ్చే ప్రజలకు కనీస వసతులు లేక చాలా ఇబ్బందులకు గురవుతూ ఉన్నారు, వీఐపీలు వచ్చినా కూడా కొంచెం సేపు సేద తీరదామంటే అందుకు అనువైన గెస్ట్ హౌస్ లు లేవు,

గతంలో దద్దినం అనే గెస్ట్ హౌస్ ఉండే అభివృద్ధి పేరిట గెస్ట్ హౌస్ తొలగించడంతో ముఖ్య అతిథులు వస్తే సేద తీరేందుకు గెస్ట్ హౌస్ లేకుండా పోయిందని ప్రజల ఆరోపణ, భక్తుల పరిస్థితి కూడా అలానే ఉందని కనీసం చెట్ల కింద అన్న సేద తీరుదాం అన్నా కూడా అవి కూడా లేవు, పేరు గొప్ప ఊరు దిబ్బలాగా కురవి పరిస్థితి ఉందని ఈ ప్రాంత ప్రజల ఆరోపణ,

కురవి మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ కలగానే మిగిలిపోయిందని కురవి గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల్లో ఆదాయం ఉన్న అల్లుడి నోట్లో శని లాగా రాజకీయ నాయకుల జోక్యాలు మితిమీరిపోయి అభివృద్ధికి ఆమడ దూరంలో కురవి ఉన్నదని గ్రామ ప్రజల ఆరోపణ, దేవాలయానికి వచ్చే భక్తులు కూడా ఆరోపణ చేస్తున్నారు,

ఐ దేవాలయం అభివృద్ధి లేక భక్తులు ఉండేందుకు నిలువ నీడ లేక చెట్ల కింద రోడ్ల వెంబడి వంట చేసుకుని అక్కడే తిని వెళ్లిపోవడం జరుగుతుందని భక్తులు ఆరోపణ, లక్షల్లో ఆదాయం వస్తున్న ఆలయం చుట్టూ భూములు ఉన్న సరిఅయిన గెస్ట్ హౌస్ లేక వీఐపీలు వచ్చినా కూడా పావుగంటలోనే స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకొని ప్రయాణం చిత్తగిస్తున్నారు. ఎక్కడో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సరైన సత్రాలు లేక ఉన్న సత్రాల్లో పరిశుభ్రత లేక ముఖ్యంగా పందులు, కుక్కలు, యాచకులు, దోమలు తోటి భక్తులు



నానా యాతలు పడుతున్నా మని అంటున్నారు, ఈ పాలకవర్గం అభివృద్ధి చేస్తదేమో అని, ఆ పాలకవర్గం అభివృద్ధి చేస్తారేమో అని అంటే ఎవరు వచ్చినా ఆ స్వామివారి కాసుల కోసం ఎదురుచూసే వారే గాని అభివృద్ధి చేసే నాధుడు లేకపాయే అని భక్తులు ఆవేదన,

కురవికి మూడు కిలోమీటర్ల దూరంలో అనంతగిరి దేవాలయం దినదినాభివృద్ధిగా అభివృద్ధి చెందుతూ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటూ ఆహ్లాదకరమైన వాతావరణంలో భక్తులు సేద తీరేందుకు పచ్చని చెట్లు పకృతి రమణీయంగా చుట్టు పచ్చని పొలాలు పక్కనే చెరువుకు మెట్లు చెరువు మధ్యలో గరుత్మంతుడు నిర్మించి అక్కడ పాలకమండలి అభివృద్ధి చేస్తూ ఉన్నారు. ప్రతి శనివారం అధిక సంఖ్యలో భక్తులు అనంతద్రి దేవాలయానికి వస్తూ ఉంటారు. మిగతా రోజుల్లో కూడా దేవాలయానికి భక్తులువచ్చి వెళుతూ ఉంటారు. తిరుపతి, తిరుమల లో మాదిరిగా సాంబారు అన్నం (ప్రసాదం ) పులిహోర పెడుతూ ఉంటారు. కానీ లక్షల్లో ఆదాయం ఉన్న వీరభద్ర స్వామి ఆలయంలో మాత్రం అర్చకులు తీర్థం పోసేందుకు కష్టంగా ఉంటుంది. భక్తుల చేతిలో పచ్చ నోటు కనిపిస్తే చాలు వారికి తీర్థప్రసాదాలతో పాటు స్వామివారి దగ్గర ఉన్న పూలు పండ్లు కూడా ఇస్తారు ఇది వీరభద్ర స్వామి ఆలయం దౌర్భాగ్యస్థితి

కురవి అభివృద్ధి చెందాలంటే పెద్ద చెరువును మినీ రిజర్వాయర్ గా నిర్మించాలి, పెద్ద చెరువు కట్టను పరిశుభ్రంగా చేసి చెట్లను పెంచి భక్తులు సేద తీరేందుకు బల్లాలు కులాయిలు ఏర్పాటు చేయాలి, ఆలయానికి అనుబంధంగా ఉన్న భూముల లను అన్యాక్రాంత కాకుండా చూసి వాటిలో గెస్ట్అవులు భక్తులు ఉండేందుకు (కాటేజీలు) సత్రాలు నిర్మిస్తే బాగుంటుందని భక్తుల ఆలోచన, పెద్ద చెరువు కాడ ఉన్న స్థలంలో సత్రాలు అభివృద్ధి పనులు నిర్మించాలని కురవి గ్రామ ప్రజల చిరకాల కోరిక,





కందగిరి పర్వతం, కురవి గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో కందగిరి పర్వతం పై వేంచేసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి, పర్వతం క్రింద వెంకటేశ్వర్ల స్వామివార్లు ఉన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తే పకృతి రమణీయంగా ఉంటుందని భక్తుల ఆశాభావం. కురవి ఆలయానికి వచ్చినవాళ్లు కురవి చుట్టూ ఉన్న పర్యాటక ప్రాంతాలను చూసి కురవి లో ఉన్న విడిది సత్రాలకు సాయంత్రం చేరుకొని ఇక్కడే ఉండే అవకాశం ఉంటుందని భక్తుల అబిప్రాయం, ఉదయం పూట మనసారా స్వామి అమ్మవారిని దర్శనం చేసుకుని వారి వారి గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఉంటుందని భక్తులు అంటున్నారు.

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి,**



కురవి మేజర్ గ్రామ పంచాయతీ, తోపాటు శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయం అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. రెండిటికి అనేక వనరులు ఉన్నా కూడా అభివృద్ధి చేయటంలో పాలకులు విఫలమయ్యారని ఆయన అన్నారు. పాలకులకు కాసుల మీద ఉన్న ఆశ అభివృద్ధిపై లేదని అన్నారు. ఇప్పటికైనా గ్రామ అభివృద్ధికి పంచాయతీ అధికారులు, ఆలయ అభివృద్ధికి పాలకవర్గం, కృషిచేసి గత పాలకవర్గాల కంటే భిన్నంగా ఉన్నామని మంచి పనులు చేశామని ప్రజలకు భక్తులకు తెలియజేయాలని ఆయన అన్నారు. వీరభద్ర స్వామి ఆలయానికి ఎటు రెండు మూడు కిలోమీటర్ల దూరంలో పర్యాటక కేంద్రాలు అనంతారం వెంకటేశ్వర స్వామి ఆలయం, కందగిరి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం కందగిరి పర్వతం పకృతి రమణీయంగా ఉండే లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉనాయి, కురవికి వచ్చిన భక్తులు కూడా ఒకటి రెండు రోజులు ఉండే విధంగా ఉంటుందని ఆయన అన్నారు.

# ప్రజల రక్షణే పోలీసుల ప్రథమ కర్తవ్యం

## పోలీస్అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో సైకిల్ ర్యాలీ నిర్వహించిన టౌన్ సిఐ మహేందర్ రెడ్డి

**తొవ్వ ,మహబూబాబాద్ ,అక్టోబర్ 28:**

పోలీస్అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మహబూబాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ... ఈ..ర్యాలీ కార్యక్రమంలో పలుపాఠశాల విద్యార్థులతోపాటు మహబూబాబాద్ టౌన్ సిఐ గట్ల మహేందర్ రెడ్డి, రూరల్ సీఐ సర్వయ్య, టౌన్, రూరల్, కురవి పోలీస్ స్టేషన్ ల ఎస్ఐలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



